క్లుప్తంగా

పాఠశాలకు టీవీల బహూకరణ



బాన్సువాడ: పట్టణంలోని కోన బాన్సువాడ ప్రాథమిక పాఠశాలకు హెచ్ఎం రాజశేఖర్ రెండు స్మార్ట్ టీవీలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 43 ఇంచుల రెండు స్మార్ట్ టీవీలను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించేందుకు టీవీలు ఉపయోగపడతాయని అన్నారు.

61వ సారి రక్తదానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణానికి చెందిన పడిహార్ కిరణ్ సోమవారం 61వ సారి రక్తం దానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణీకి అత్యవసరంగా 'ఓ' నెగిటివ్ రక్తం అవసరం కావడంతో రక్తదాతల సమూహం ద్వారా విషయం తెలుసుకున్న కిరణ్ రక్తం దానం చేశారు. రక్తం ఇవ్వడం పట్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ అభినందించారు.

పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ



ఎల్లారెడ్డి: పట్టణంలోని మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పోచవ్వ సోమవారం పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫాంలను అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జహంగీర్, ఉపాధ్యాయులు రాజశేఖర్, ప్రియదర్శిని, లక్ష్మణ్‌సింగ్, బల్వంత్‌రావు, విద్యార్థులు తదితరులున్నారు.

ఇబ్రహీంపేట జెడ్పీ హైస్కూల్లో..



బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్ జెడ్పీహైస్కూల్‌తో పాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు నోట్‌బుక్కులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను గ్రామ పెద్దలు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మాజీ సర్పంచ్ మాలెపు నారాయణరెడ్డి, నాయకులు మాలెపు వెంకట్‌రెడ్డి, మంత్రి గణేష్, ఉద్దర హన్మాండ్లు తదితరులున్నారు.

మంగ్లూర్‌లో..



నిజాంసాగర్(జుక్కల్): మంగ్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తువులను పంపిణీ చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ లలిత, నాయకులు దత్తు, సాయిలు, హెచ్ఎం యశ్వం, ఉపాధ్యాయులు సీహెచ్ నరేశ్ తదితరులున్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు..



లింగంపేట(ఎల్లారెడ్డి):శెట్పల్లిసంగారెడ్డి,మోతె, పోల్కంపేట,సజ్జన్‌పల్లి,శెట్పల్లి గ్రామాల్లో పలువురికి కల్యాణ లక్ష్మి చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాగౌడ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆదేశాల మేరకు ఆయా గ్రామాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేసినట్లు తెలిపారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్ నాయక్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫియోద్దీన్, కో- ఆర్డినేటర్ ఎల్లమయ్య, నగేష్ పాల్గొన్నారు.

కమ్మ సంఘం అధ్యక్షుడిగా కొసరాజు ఉదయభాస్కర్



బాన్సువాడ:బాన్సువాడ కమ్మ సంఘం అధ్యక్షుడిగా కొసరాజు ఉదయభాస్కర్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షుడిగా నాదెండ్ల రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా చిలుకూరి మల్లిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ..కమ్మ సంఘం కోసం 500 గజాల స్థలాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.స్థలాన్ని విరాళంగా ఇచ్చిన అధ్యక్షుడు ఉదయ భాస్కర్ దంపతులకు కమ్మ సంఘం నేతలు సన్మానించారు.

ఈ రోడ్లపై నడిచేదెలా..?





బురదమయంగా మారిన బుర్నపూర్ - అల్లాపూర్ రోడ్డు



కంభపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో గుంతలలో నిలిచిన వర్షపు నీరు

- పిట్లం పరిధిలో చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారిన రోడ్లు
- ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం
- కనీసం చిన్నపాటి మరమ్మతులు కూడా చేయని వైనం

పిట్లం(జుక్కల్): వర్షాలు కురిస్తే చాలు మట్టి రోడ్లు చిత్తడి చిత్తడిగా మారుతున్నాయి. దీంతో బురదమయమైన రోడ్లతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వాహనదారులు ప్రయాణించలేక పోతున్నారు. ఇది ఏ మారుమూల గ్రామం అనుకుంటే బురదలో కాలేసినట్లే. మండల కేంద్రం అయిన పిట్లంలోని పలు కాలనీలలో, మండలంలోని చిన్న కొడప్గల్ - బుర్నపూర్, బుర్నపూర్ - అల్లాపూర్, చిల్లర్గి - పారేడ్‌పల్లి, కుర్తి గేట్ - కుర్తి, తిమ్మనగర్ - మార్దండ - కంభపూర్ తదితర గ్రామాలకు వేళ్లే రోడ్లు గుంతలతో అధ్వానంగా మారాయి. వాహనదారులు ఈ రోడ్డులో ప్రయాణం చేసేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. పాడైపోయిన రోడ్డుకు కనీసం మరమ్మతులు చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లతో చిరు వ్యాపారులు, దుకాణదారులు పడరాని పాట్లు పడుతున్నారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాలలోని వర్షం పడితే నీళ్ల రహదారులపై ఆగుతున్నాయి. పంచాయతీ అధికారులు, ప్రత్యేక అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వర్షాకాలం మొదట్లోనే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజులలో సమస్య ఇంకా తీవ్రమవుతుందని.. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి'



పోస్టర్లను ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు



ఎల్లారెడ్డిలో మొక్కలను నాటుతున్న బీజేపీ నేతలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నిలకు సిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి అన్నారు. నరేంద్ర మోదీ భారత ప్రధానిగా 11 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం తాడ్వాయి పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆర్టికల్-370, ట్రిపుల్ తలాక్, అయోధ్య రామ మందిర నిర్మాణం, గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, ఆపరేషన్ సిందూర్, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో జపాన్‌ను వెనక్కి నెట్టి 4వ స్థానంలో భారత్‌ను నిలబెట్టడడం వంటివి సాధించడం గొప్ప విశేషమన్నారు. అభివృద్ధికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎర్రాపహాడ్ పీహెచ్‌సీలో మొక్కలు నాటారు. నాయకులు గంగారెడ్డి, వెంకట్‌రావు, లింగారావు, హోటల్‌శ్రీనివాస్, నర్సిములు, తదితరులున్నారు.

ఎల్లారెడ్డిరూరల్: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సోమవారం మొక్కలను నాటారు. 11 ఏళ్ల బీజేపీ పాలన విజయవంతంగా ముగియడంతో పాటు అమ్మ పేరిట మొక్కలను నాటాలన్న ప్రధాని సందేశంలో భాగంగా వారు మొక్కలను నాటారు. నాయకులు రాజేష్, బాలకిషన్, కాశి, బాలయ్య తదితరులున్నారు.

ఆయిల్ బాల్స్ తయారీ



బీబీపేటలో తయారు చేస్తున్న జీపీ కార్మికులు

బీబీపేట: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురికి కాలువల్లో వేసే ఆయిల్ బాల్స్‌ను సోమవారం తయారు చేశారు. ఈ సందర్భంగా కారోబార్ సిద్దరాములు మాట్లాడుతూ.. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అంటు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే చెత్తా చెదారాన్ని వెంటనే తొలగించాలని సూచించారు.

రైల్వే స్టేషన్ ద్వారం .. చెత్తమయం



చెత్తతో దర్శనమిస్తున్న రైల్వే స్టేషన్ పడమటి ద్వారం

కామారెడ్డి అర్బన్: పచ్చదనం, పరిశ్రుభత, స్వచ్ఛత నినాదాలతో రైల్వే స్టేషన్లలో నినాదాలు గోడమీద రాతలుగా మిగిలిపోతున్నాయి. కామారెడ్డి రైల్వే స్టేషన్ పడమటి ద్వారం వివేకానంద కాలనీ వైపు రైల్వే అధికారులు పరిశుభ్రతను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కాలనీవాసులు, ప్రయాణికులు వేసిన చెత్తను ఇటు మున్సిపల్ అధికారులు, అటు రైల్వే అధికారులు పట్టించుకోకపోవడంతో ద్వారం వద్ద చెత్తపేరుకుపోయి దుర్వాసన వస్తోంది. వ్యర్థాల కోసం కుక్కలు, కోతులు చేరి ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకుని ప్రతి రోజూ శుభ్రం చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం జిల్లా రవాణ శాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో పలు స్కూల్ యజమాన్యాలు ఫిట్‌నెస్ లేకుండా, అనుభవం లేని డ్రైవర్లు,బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బస్సులను నడుపుతున్నాయని తెలిపారు. తక్షణమే స్కూళ్లపై దాడులు చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నీల నాగరాజు, కుంబాల లక్ష్మణ్ యాదవ్, సభావత్ వినోద్ నాయక్‌లు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలపై దృష్టి పెట్టాలి



నేతలతో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

భిక్కనూరు: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సూచించారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని గంప గోవర్ధన్ నివాసానికి వెళ్లారు. ఇటీవల అనారోగ్యానికి గురైన గంప గోవర్ధన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకోవాలన్నారు. నాయకులు గంగల రవీందర్, జ్ఞానప్రకాశ్‌రెడ్డి, కర్రోళ్ల రాజు, గోసు రమేశ్ పాల్గొన్నారు. అలాగే బస్వాపూర్, కాచాపూర్, పెద్దమల్లారెడ్డి, గుర్జకుంట గ్రామాలకు చెందిన నాయకులు ఆయనను పరామర్శించారు.

విద్యుత్ సిబ్బంది మృతికి సంతాపం



సంతాపం తెలుపుతున్న విద్యుత్ సిబ్బంది

కామారెడ్డి అర్బన్: విద్యుత్‌ఘాతంతో ఇటీవల ప్రాణాలు కోల్పోయిన దూంపేట రాజేశం, బి.కాంత్రికుమార్ సేవలను కొనియాడుతూ సోమవారం ఎన్‌పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది మౌనం పాటించి తీవ్ర సంతాపం తెలిపారు. స్థానిక పవర్ హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఈ శ్రావణ్‌కుమార్ మట్లాడుతూ.. విధులు నిర్వహించే టప్పుడు నిబంధనల మేరకు తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.

ఎస్సీవాడలో నీటి సమస్య



ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఎస్సీవాడలో నీటి సమస్య నెలకొంది. మిషన్ భగీరథ నీరు కొన్ని రోజులుగా రావడంలేదు. సమస్యను స్థానికులు పంచాయతీ సిబ్బందికి దృష్టికి తీసుకురావడంతో గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వార నీటిని సరఫరా చేస్తున్నారు. జీపీ కార్యదర్శి బల్‌రాం మాట్లాడుతూ.. తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'రైతు నేస్తం' వీక్షణ



నస్రుల్లాబాద్‌లో వీసీకి హాజరైన అధికారులు, రైతులు

సాక్షి నెట్‌వర్క్:రాష్ట్రవ్యాప్తంగా కొత్త రైతు వేదికల్లో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని సోమవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం వీడియో కాన్ఫరెన్సు(వీసీ) ద్వారా రైతులతో ముచ్చటించారు. ప్రతి మంగళవారం రైతు వేదికలలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వీసీ ద్వారా రైతులకు పంటల సాగుపై అవగాహన ఉంటుందన్నారు. దీనిలో రైతులు తమ సమస్యలను సైతం తెలుసుకోవచ్చని అన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అన్నదాతలు, అధికారులు రైతు వేదికలకు భారీగా చేరుకుని కార్యక్రమాన్ని ఆద్యంతం వీక్షించారు.

ఏఎస్సై ప్రకాశ్ నాయక్ బదిలీ

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్సై ప్రకాశ్ నాయక్‌ను ఉన్నతాధికారులు బదిలీ చేసినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. ప్రకాష్‌నాయక్ కొంత కాలంగా లింగంపేటలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన లింగంపేట నుంచి గాంధారి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై, సిబ్బంది ఆయనను సన్మానించి.. సేవలను కొనియాడారు.

సంక్షిప్తం

డ్రైయినేజీలో పూడిక తొలగింపు

బాన్సువాడ: పట్టణంలోని ఎస్‌బీఐ ఎదుట డ్రైయినేజీలో పేరుకుపోయిన పూడికను సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు.. సిబ్బందితో తొలగింపజేశారు. పూడిక నిండిపోవడంతో వర్షపు నీరు ప్రధాన రహదారిపైకి వచ్చి వాహనదారులకు ఇబ్బందులకు గురి చేసేది. మోకాల్లోతులో వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడేవి. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి పనులు పర్యవేక్షించారు.

కుక్కల బెడదను పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని 15వ వార్డు అశోక్‌నగర్ కాలనీలో వీధి దీపాలు, వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వనిత సోమవారం కలెక్టర్ అశిష్ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. వార్డులో వీధి దీపాలు చెడిపోయి చాలా కాలం అవుతున్నా నూతన దీపాలను ఏర్పాటు చేయడం లేదని ఆయన దృష్టికి తెచ్చారు. అలాగే వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం గ్రామ పంచాయతీలో ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వర్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఉన్న చిన్నారుల బరువులు, కొలతలను ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారంగా పౌష్టికాహారం అందించాలని సూపర్‌వైజర్ సూచించారు.

రైతుభరోసా కోసం దరఖాస్తులు చేసుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతు భరోసా పథకం కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏఈవో కవిత సూచించారు. కొత్తగా పట్టాలు అయిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను అందజేయాలన్నారు. ఈ నెల 20 లోపు దరఖాస్తు ఫారంతో పాటు పైన తెలిపిన సర్టిఫికెట్లను కార్యాలయంలో అందజేయాలన్నారు.

తాడ్వాయిలో ప్రజావాణి ఫిర్యాదు నిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్వేత మాట్లాడుతూ.. ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఎంఈవో రామస్వామి, ఏపీఎం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ శివాలయంలో ప్రత్యేక పూజలు

నస్రుల్లాబాద్: నెమ్లిలో గల పంచముఖ శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీ నిలో భాగంగా ఉదయం పంచామృత, రుద్రాభిషేకాలను వేద పండితులు చేపట్టారు. అనంతరం విభూది అలంకరణ చేసి భక్తులకు పంచముఖ లింగదర్శనం కల్పించారు.

ఘనంగా రుద్రాభిషేకాలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేదబ్రాహ్మణుడు సంతోష్‌కృష్ణ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ రాజయ్య, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి చిత్రం

జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్ !



చుక్కాపూర్‌లో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

మాచారెడ్డి: చుక్కాపూర్ గ్రామంలో ఊరి నడుమ జనావాసాల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడు పడడంతో పలుమార్లు పేలిపోయింది. దీంతో చుట్టుపక్కల ఉన్న వారు భయాందోళనలకు గురయ్యారు. గతంలో రెండుసార్లు షార్ట్ సర్క్యూట్‌తో గేదెలు మృతిచెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయడమో లేదంటే అక్కడి నుంచి మరో చోటికి మార్చాలని స్థానికులు కోరుతున్నారు. – వి.కృష్ణమూర్తి, చుక్కాపూర్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

బాన్సువాడ గ్రామీణ విద్యుత్ అధికారుల కొత్త ఫోన్‌నెంబర్లు

క్యాడర్	ఫోన్ నంబర్	క్యాడర్	ఫోన్ నంబర్
ఏఈ బాన్సువాడ రూరల్	871 2481 971	లైన్‌మన్ తాడ్కోల్	871 2481 969
లైన్ ఇన్స్‌పెక్టర్ బాన్సువాడ రూరల్	871 2481 964	లైన్‌మన్ తాడ్కోల్ సబ్‌స్టేషన్	871 2481 971
లైన్‌మన్ దేశాయిపేట్	871 2481 965	లైన్‌మన్ ఇబ్రాహింపేట్ సబ్‌స్టేషన్	871 2481 967
లైన్‌మన్ హన్మాజీపేట్	871 2481 966	లైన్‌మన్ కోనాపూర్ సబ్‌స్టేషన్	871 2481 968

– బాన్సువాడ రూరల్

దరఖాస్తుదారులతో దురుసు ప్రవర్తన



పిట్లం రెవెన్యూ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు

పిట్లం(జుక్కల్): స్థానిక తహసీల్ కార్యాలయంలో రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకున్న ప్రజల పట్ల సిబ్బందిలో ఒకరు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు దరఖాస్తుదారులు పేర్కొన్నారు. దరఖాస్తులు ఇచ్చి వారం రోజులైనా వాటిలో కదలిక లేదని దరఖాస్తుదారులు ఆరోపిస్తూ.. ఇదే విషయంపై సంబంధిత జూనియర్ అసిస్టెంట్‌ను సంప్రదించగా.. తాను సెలవులో ఉన్నానని, రెవెన్యూ సదస్సులో ఉన్నానని, మరోసారి తనకు తహసీల్దార్ టోకేన్ ఇవ్వలేదని సమాధానం ఇస్తూ దాటవేస్తున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకొని, సమస్యను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

పుస్తకాలు విక్రయిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



జిల్లా కేంద్రంలో ఓ పాఠశాలలో విక్రయిస్తున్న పుస్తకాలను చూపిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు



డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నాయకులు



మాట్లాడుతున్న టీజీవీపీ నాయకులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, ఇతర సామాగ్రి విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఓ స్కూల్ గదిలో నిల్వ ఉంచి విక్రయిస్తున్న పుస్తకాలు, బ్యాగులు, డ్రెస్సులను పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఎంఈవో ఎల్లయ్యకు ఫోన్‌లో సమాచారం ఇవ్వడంలో పుస్తకాలు విక్రయిస్తున్న గదిని సీజ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, బీడీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, తదితరులున్నారు.

ప్రైవేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: నిబంధనలకు విరుద్ధంగా నోట్ బుక్స్, ఇతర సామగ్రి విక్రయిస్తున్న ఓ ప్రయివేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు సోమవారం డీఈవో రాజుకు ఫిర్యాదు చేశారు. స్కూల్‌లో ఓ గదిలో నిల్వ ఉంచి విక్రయిస్తున్న వస్తువుల వీడియోలను, ఫొటోలను డీఈవోకు అందజేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రోహిత్, నాయకులు పవన్, సందీప్, సన్నీ, యోగి తదితరులున్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్(టీజీవీపీ) జిల్లా అధ్యక్షుడు అల్లూరి ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. స్కూల్ ఆవరణలో యూనిఫాం, బ్యాగులు, పుస్తకాలు విక్రయిస్తున్నారని తెలిపారు. నాయకులు విజయ్, రాజు, భాస్కర్, అశోక్, రమేష్ తదితరులున్నారు.

గిరిజా షెట్కార్‌ను కలిసిన జుక్కల్ కాంగ్రెస్ నేతలు



గిరిజా షెట్కార్‌తో కాంగ్రెస్ నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గిరిజా షెట్కార్‌ను సోమవారం హైదరాబాద్‌లో జుక్కల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ తనయ గిరిజా షెట్కార్‌కు టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సన్మానించారు. నాయకులు జయప్రదీప్, సూరత్‌రెడ్డి, శ్రీనివాస్, పండరి, గౌస్ తదితరులు ఉన్నారు.